చలిగాలి.. జాగ్రత్తగా మెలగాలి

పెరుగుతున్న చలి తీవ్రత

● జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



సంగారెడ్డి పట్టణ శివారులో పొగ మంచుతో కమ్ముకున్న రోడ్డు పైన వాహనదారులు

సంగారెడ్డి టౌన్: గత వారం రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతో రాత్రివేళల్లో ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. చలితో పల్లెలు పట్టణాలు.. వణికిపోతున్నాయి. ఉ.10 వరకు కూడా చలితీవ్రత తగ్గకపోవడంతో జనాలు బయటకు వచ్చే పరిస్థితి లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు స్వెటర్లు ఇతర రక్షణ దుస్తులు ధరించి వెళ్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రతకు వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తూ ఆహార అలవాట్లలో మార్పులు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవని సలహాలిస్తున్నారు. రాత్రివేళల్లో, తెల్లవారు జామున చల్లటి గాలులు వీస్తూ కనిష్ట ఉష్ణోగ్రత్త 15 డిగ్రీలకు పడిపోతుంది. చలికాలంలో శరీర వ్యవస్థలో మార్పులతో చిన్నపిల్లలతో పాటు వృద్ధుల్లో వ్యాధులు సంక్రమించే అవకాశముంది.

జిల్లాలో ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోయాయి. 11 గంటల వరకు చలి తగడం లేదు. సాధారణం కంటే అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలికాలంలో ప్రతి ఒక్కరూ సరైన జాగ్రత్తలు పాటించాలి. మరి ముఖ్యంగా అస్తమా వ్యాధితో బాధపడుతున్న వారు, చిన్నపిల్లలు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చలికాలంలో జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశముంది. ప్రతి ఒక్కరూ వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్‌ల వాడకం తగ్గించాలి. చలికి ఎక్కువగా తిరగకూడదు. చలిమంటలు కాపకూడదు. చర్మంపై అశ్రద్ధ వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

మంచు కమ్ముకోవడం సాధారణం

మంచు కమ్ముకున్న సమయంలో వాహనాలను జాగ్రత్తగా నడపాలి. రహదారిపై దగ్గరకు వచ్చేవరకు ఎదురుగా ఉండే వాహనాలు కనిపించే అవకాశం లేనందున వీలైనంత నెమ్మదిగా వాహనాలు నడిపిస్తే ప్రమాదాల బారిన పడే అవకాశముండదు. రోడ్డు స్పష్టంగా కనిపించని పక్షంలో వాహనాలను సురక్షిత ప్రాంతంలో నిలిపివేయడం మంచిది.

జాగ్రత్తలు తీసుకోవాలి..

జనరల్ ఫిజిషియన్ డాక్టర్ హిమబిందు



- చలికాలంలో ఎండ వచ్చే వరకు చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా వ్యాధిగ్రస్తులు బయటకు రావద్దు. ఉన్ని దుస్తులతో పాటు శరీరానికి వెచ్చదనం ఇచ్చే దుస్తులను వేసుకోవాలి.
- తలకు మఫ్లర్, మంకీ టోపీలను పెట్టుకోవాలి.
- మంచుకురిసే వేళలో బయట తిరగవద్దు.
- చలిమంటలు కాపుకోవద్దు.
- చాలా మంది గ్రామాల్లో చలి తీవ్రతకు చలిమంటలు పెట్టుకుంటారు. దీంతో అనేక ప్రమాదాలు సంభవిస్తాయి. ఒక్కోసారి మంటలకు కళ్లు తిరిగి కిందపడిపోతారు. లోబీపీకి గురవుతారు.
- దుప్పట్లు కప్పుకుని చాలా మంది మంటల వద్ద కూర్చుంటారు. అప్పుడప్పుడు మంటలు దుప్పట్లు అంటుకునే. ప్రమాదాలు కూడా ఉంటాయి.
- చిన్నపిల్లలను మంటల వద్దకు ఎట్టి పరిస్థితిల్లో రానివ్వకూడదు.

త్వరలో అర్హులకు కొత్త రేషన్ కార్డులు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: త్వరలో అర్హులైన వారికి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేయనుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. నాగల్‌గిద్ద మండలం మావినెల్లి నుంచి గోందెగాంకు రూ.2.15కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, నాగల్‌గిద్ద, మనూరు మండల కేంద్రాల్లో ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10లక్షల చొప్పున 20లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా జారీ చేయలేదని, కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన కార్డులే ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.500 సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. నియోజకవర్గానికి మొదటి విడతలోనే రూ.150కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ గురుకులం మంజూరయిందని తెలిపారు. పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయి విద్య అందనుందన్నారు. త్వరలో ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు గ్రామ, గ్రామాన ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ ముఖ్య నాయకులు రాకేష్ షెట్కార్, వినోద్‌పాటిల్, పండరిరెడ్డి, రమేష్ చౌహాన్, దిగంబర్‌రెడ్డి, రాఘవాచారి, బ్రహ్మానందరెడ్డి, రాజు, సంజీవులు, సిద్దారెడ్డి, ఆకాష్‌రావుపాటిల్, సంగమేశ్, జ్ఞానోబారావుపాటిల్, గుండుపాటిల్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

జహీరాబాద్: ఆరోగ్య అంశాలపై డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ మనోహర్‌రెడ్డి వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డివిజన్ పరిధిలోని ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిబిడ్డల ఆరోగ్యం, వ్యాధినిరోధక టీకాలు, ఎంసీడీ, లెప్రసీ సర్వే తదితర విషయాలపై చర్చించారు. సీజనల్ వ్యాధులు ఏ మేరకు ఉన్నాయనే విషయమై మనోహర్‌రెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వైద్యులు నవీన్, నరేందర్, రమ్య, నిఖిల, నుపిన్ చక్రవర్తి, హైమావతి, నవనీత, సొహాయిల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న భరత్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ కొల్లూరి భరత్ పేర్కొన్నారు. బుధవారం తెల్లాపూర్‌లోని 8వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం చేసే అభివృద్ధి పనులు పది కాలాల పాటు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా పాటించని పక్షంలో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు

పంచాయతీ కార్యదర్శి సుభాష్



నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: కూల్చివేసిన అక్రమ కట్టడాలను తిరిగి నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంద్రేశం గ్రామపంచాయతీ కార్యదర్శి సుభాష్ హెచ్చరించారు. బుధవారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం పరిధిలోని ఆర్‌కే –2 నవ్య సెంటర్ లో గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులకు మించి భవనాలు నిర్మిస్తుండటంతో నోటీసులు జారీ చేశారు. అయినా వినకుండా పనులు చేస్తుండడంతో కూల్చి వేస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు. పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులు మేరకే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు

ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్



పత్రాలు అందజేస్తున్న పీఎఫ్ కమిషనర్

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. బుధవారం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కార్యాలయంలో ప్రయాస్ పథకం ద్వారా పదవీ విరమణ పొందిన 20 మంది చందాదారులకు జారీ చేసిన పెన్షన్ పత్రాల్లో 7గురికి డివిజన్ పరిధిలోని వాల్యూ జోన్‌లో జరిగిన నిధి ఆప్కే నికత్ కార్యక్రమంలో అందజేశారు. అనంతరం ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ.. 'ప్రయాస్' కార్యక్రమం ద్వారా చందాదారులకు మెరుగైన సేవలందించాలనే నిబద్ధతను నెరవేర్చడానికి ఒక ప్రయత్నమన్నారు. కార్యక్రమానికి పీఎఫ్ కమిషనర్–2 శ్రీదేవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళా ప్రదర్శన



ప్రదర్శనలు నిర్వహిస్తున్న సభ్యులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలో ప్రజాపాలన– విజయోత్సవాలపై బుధవారం కళా ప్రదర్శనలు చేశారు. జిల్లా సమాచార పౌరసంబంధల శాఖ ఆధ్వర్యంలో టీం లీడర్ కొమ్ముల శేఖర్‌గౌడ్ నేతృత్వంలో కల్హేర్, మాసాన్‌పల్లి, కృష్ణాపూర్‌లో కళా ప్రదర్శనలు నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, రూ. 500కు వంట గ్యాస్, తదితర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిపించారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు నేనవత్ మదన్‌సింగ్, రవీందర్, ధరావత్ రాజు, ఆగమయ్య, సాయిలు, శశిప్రియా, స్వప్న పాల్గొన్నారు.

జిన్నారంలో..

జిన్నారం (పటాన్‌చెరు): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తోంది. బుధవారం జిన్నారం మండల కేంద్రంలోని వావిలాల, మంగంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణ వద్ద ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కళాకారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరిస్తూ ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం నింపారు. కార్యక్రమంలో కళాకారులు సునీల్, రమేష్, దుర్గేష్, మల్లేష్, సంధ్య, వినేష్, నవీన్, శంకర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరకు తోటల సాగుపై సూచనలు



రైతులకు సూచనలు ఇస్తున్న విజయ్‌కుమార్, భిక్షపతి

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ గ్రామ పరిధిలో రైతులు పండించిన పరిపక్వదశలో ఉన్న చెరకు తోటలను బుధవారం శాస్త్రవేత్త, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. బసంత్‌పూర్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్, ఏడీఏ భిక్షపతి చెరకు సాగులో సమస్యలను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. వాతావరణం, భూమి స్థితిగతులకు అనుగుణంగా అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. చీడపీడలు తట్టుకునే గుణాలను బేరీజు వేసుకుని పంట సాగులో ముందడుగు వేయాలన్నారు. చెరకులో ఆశించే శిలీంద్ర తెగుళ్లను అరికట్టేందుకు విత్తన శుద్ధి తప్పకుండా చేయాలన్నారు. దిగుబడి విషయంలో ఎరువుల పాత్ర కీలకమన్నారు. సిఫార్సు మేరకు ఎరువులు వాడితే అధిక దిగుబడులు పొందవచ్చని, పోటాష్ ఎరువు చాలా ముఖ్యమన్నారు. తోటల కటింగ్ సీజన్ ప్రారంభమైనందున తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమలో వ్యవసాయ అధికారిణి లావణ్య రైతులు పాల్గొన్నారు.

లగచర్ల గిరిజనులపై వ్యూహాత్మక దాడి



లగచర్లకు బయలుదేరిన గిరిజన నేతలు

సంగారెడ్డి: రాష్ట్రంలో లగచర్ల గిరిజన రైతులు కేసుల పాలై సంగారెడ్డి జైలులో మగ్గుతుంటే కొంతమంది లంబాడీ సంఘాల నాయకులు జాతికి ద్రోహం చేస్తున్నారని లంబాడీల ఐక్య వేదిక సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఎం అశోక్‌నాయక్ మండిపడ్డారు. బుధవారం జిల్లా కేంద్రం సంగారెడ్డి నుంచి లాగిచర్లకు నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. జాతి మీద చిత్తశుద్ధి ఉంటే పార్టీలకు ప్రభుత్వానికి సింహ స్వప్నంలాగా మారి, ప్రతిపక్షం పాత్ర పోషించాల్సిన కొన్ని లంబాడీల సంఘాల నాయకులు కాంగ్రెస్ , బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు బానిసత్వం చేస్తున్నారని దుయ్యబట్టారు. కొడంగల్‌లో లంబాడీల పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించి మెరుగు పరుచుకోవాలని సూచించారు.

రేకుల షెడ్ల తొలగింపు



జేసీబీలతో కూల్చిన షెడ్లు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని 285 సర్వే నంబర్ అసైన్డ్ భూమిలో నిర్మించిన రేకుల షెడ్లను అధికారులు తొలగించారు. కొన్ని షెడ్లను తొలగించి, మిగిలిన కట్టడాలను వదిలేయడంపై అధికారుల తీరును బాధితులు తప్పుపట్టారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడవద్దని.. ప్రభుత్వ భూమిని కాపాడతామంటే అధికారులకు పూర్తిగా సహకరిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. చట్టాలు కొందరిపైనే ప్రయోగిస్తామనేలా అధికారులు వ్యవహరించడం విచారకరమన్నారు. దళితులమనే చిన్నచూపుతో షెడ్లను కూల్చారని ఆరోపించారు. భూమి కేటాయించిన పట్టాదారు వద్ద రూపాయి రూపాయి కూడబెట్టి ఒకటి, రెండు గుంటలను కొనుగోలు చేసి షెడ్లను నిర్మించుకున్నామన్నారు. అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. 285 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణాలన్నింటిని కూల్చాలని డిమాండ్ చేశారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్ చెరు ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. పోలీసులు మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బుధవారం వారిని సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఆకస్మికంగా మధ్యాహ్న భోజనం తనిఖీ



కొండాపూర్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీఓ



జిన్నారం(పటాన్‌చెరు): తనిఖీ చేస్తున్న తహసీల్దార్ గంగాభవాని



కంది: భోజనాన్ని పరిశీలిస్తున్న రవీందర్ రెడ్డి



జహీరాబాద్: వంటను పరిశీలిస్తున్న ఆర్డీఓ

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని గిర్మాపూర్ గురుకులంలో అధికారులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ నెల 24న గురుకుల పాఠశాలలో పురుగుల అన్నం, కుళ్లిన ఆకుకూరలతో విద్యార్థులకు నాసిరకమైన ఆహారాన్ని అందిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో అడిషనల్ కలెక్టర్ మాధురి ఆహారాన్ని పరిశీలించి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో మండల అధికారులు ఎప్పటికప్పుడు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని సూచించడంతో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ పరిశీలించారు.

కందిలో..

కంది(సంగారెడ్డి): కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలనీ ఆర్డీఓ రవీందర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం కందిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి తీసుకువచ్చిన భోజనాన్ని తింటూ ఉండడంతో అక్షయ పాత్ర ద్వారా అందజేస్తున్న భోజనం ఎందుకు తినడం లేదని ఆర్డీఓ విద్యార్థులను ప్రశ్నించారు. ఆ భోజనం తమకు పడకపోవడంతో ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నామని తెలిపారు.

నిజాంపేటలో..

నారాయణఖేడ్: మండల కేంద్రం నిజాంపేటలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. వంటగది, శుభ్రతను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, భోజనం వండుతున్న కార్మికులు, విద్యార్థులతో మాట్లాడారు. వండిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ రాములు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, పంచాయతీ కార్యదర్శి సిద్దులక్ష్మణ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రాథోడ్, ప్రవీణ్, హరి, విఠల్, వెంకట్‌రాంరెడ్డి, విజయలక్ష్మిలతో కలిసి భోజనం చేశారు.

గుమ్మడిదల మండల కేంద్రంలో..

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ గంగాభవాని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో మూత్రశాలలు బాగు చేయాలని ఆమెకు విద్యార్థులు విన్నవించారు. అలాగే, శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని ఆమె విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ వార్డెన్, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సిర్గాపూర్ మండలంలో..

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం నల్లవాగు గురుకుల పాఠశాలను బుధవారం మండల పుడ్‌సేఫ్టీ కమిటీ అధికారులు తనిఖీ చేశారు. తహసీల్దార్ ఉమశంకర్, ఎంపీడీఓ మల్సూర్, ఎంఈఓ నాగరం శ్రీనివాస్ తనిఖీల్లో పాల్గొన్నారు. పాఠశాల పరిసరాలు, భోజనశాల, మరుగుదొడ్లు, తాగునీటి వసతిని పర్యవేక్షించారు. వంటగదిలోని సరుకులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య, సీఆర్‌పీ శివకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ భాను పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్: పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆర్డీఓ రాంరెడ్డి బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహ పరిసరాలను, వంటగదిని, సామగ్రి గదిని, మరుగుదొడ్లను ఈ సందర్భంగా పరిశీలించారు. ఆహారాన్ని, సరుకుల నాణ్యతను చూశారు. అన్నం, పప్పు, కూరగాయలు, గుడ్లు, మజ్జిగ నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల గదులను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో గదులు కురుస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. మరమ్మతులకు కావాల్సిన నిధుల మంజూరు కోసం అంచనాలు గురించి ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించినట్లు ఆర్డీఓ పేర్కొన్నారు. విద్యార్థులకు నెల వారీ వైద్య పరీక్షలు జరుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. భోజనం వేడిగా ఉన్నప్పుడే అందించాలని వార్డెన్ కృష్ణవంశీ, వంట సిబ్బందిని ఆదేశించారు.

పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను కలిసిన నేతలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ను గాంధీభవన్‌లో బుధవారం తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..గురువారం ముత్తంగిలో తన హోటల్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించినట్లు తెలిపారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి



జీవాలకు టీకాలు వేస్తున్న వైద్యుడు గణేష్

న్యాల్‌కల్(జహీరాబాద్): జీవాలకు వ్యాధులు రాకుండా టీకాలను వేయించాలని న్యాల్‌కల్ పశు వైద్యాధికారి గణేష్ కోరారు. బుధవారం మండలంలోని అత్నూర్, డప్పూర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి 790 గొర్రెలు, 340 మేకలకు పీపీఆర్(ముసర వ్యాధి)వ్యాక్సిన్‌ను వేశారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ.. జనవరి, ఫిబ్రవరి మాసంలో ముసర వ్యాధి ఎక్కువగా వస్తుందని ఫలితంగా జీవాలు తీవ్ర విరేచనాలు, జ్వరం వచ్చి, వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుందన్నారు. వ్యాధి తీవ్రత అధికమైతే జీవాలు మృత్యువాత పడుతాయన్నారు. వ్యాధిని ముందుగా నివారించేందుకు అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాక్సినేషన్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేవీఓ కిషన్‌రావు, వీఏ లక్ష్మి, ఓఎస్ మాజీద్, ప్రభావతి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వ్యక్తి అదృశ్యం



సంగారెడ్డి క్రైమ్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్ కాలనీ రోడ్డు నంబర్–7కు చెందిన గంపల బాల్‌రాజ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో భార్య గంపలరాణి అనుమానంతో బాల్‌రాజ్ వద్ద పని చేసే శ్రీశైలం అనే వ్యక్తిని సంప్రదించగా సన్‌రైజ్ ఆస్పత్రి వద్ద దింపి, తనకు పని ఉందని చెప్పి వెళ్లాడని చెప్పాడు. బాల్‌రాజ్‌కు అతని భార్య ఫోన్ చేయగా నాకు అప్పుల టార్చర్ ఎక్కువైతుందని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. అతని ఆటో పటాన్‌చెరువు మండలంలోని ఇక్రిశాట్ పరిశోధన వద్ద ఉన్నట్లు భార్యరాణి బంధువులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ లగ్జరీ బస్సు ప్రారంభం

నారాయణఖేడ్: కార్తీకమాసం సందర్భంగా బుధవారం ఖేడ్ ఆర్టీసీ డిపో సూపర్ లగ్జరీ బస్సు అరుణాచలం గిరిప్రదక్షిణకు 36 మంది భక్తులతో డిపో నుంచి బస్సు బయలుదేరింది. డిపో మేనేజర్ మల్లేశయ్య జెండా ఊపి ప్రారంభించారు. డీఎం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్‌లను ప్రయాణికులు ఘనంగా సన్మానించారు. డిసెంబర్ నెలలో పౌర్ణమి సందర్భంగా ప్రదక్షణకు వెళ్లే భక్తులు, ప్రయాణికులకు సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తున్నామని డీఎం తెలిపారు. భక్తులు ఇప్పటినుంచే సీట్లను రిజర్వేషన్ చేసుకోవాలని పీఆర్‌ఓ పాండు కోరారు. 94410 71134, 9959223170, 9676667703 నంబర్లకు ఫోన్ చేసి బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

◆ తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలి

మునిపల్లి(అందోల్): కులగణన సర్వే రిపోర్టులో ఉన్న పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని ఎంపీడీఓ హరినందన్‌రావు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. బుధవారం మండలంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో డేటా ఎంట్రి చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరును పరిశీలించారు. ఆయా గ్రామాలకు సంబందించిన పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి డేటా ఎంట్రీ సక్రమంగా చేయించాలని, ఎవైనా తప్పులుంటే పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శులే వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

◆ గురుకులంలో 'బచపన్ బచావో'



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రంజోల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో 'బచపన్ బచావో' కార్యక్రమం నిర్వహించారు. ప్యానెల్ అడ్వకేట్‌లు రుద్రయ్యస్వామి, రాఘవేంద్ర నాయక్ పిల్లలు, యువత భవిష్యత్ అంశంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహ నిరోధక చట్టం, సైబర్ క్రైం, బాలకార్మికులు తదితర చట్టాలపై వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో బాల్య వివాహ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, ప్రిన్సిపాల్ సృజన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ బీఆర్‌ఎస్ నాయకుల దర్గా దర్శనం

మునిపల్లి(అందోల్): మండలంలోని పెద్దగోపులారం గ్రామంలో సద్గురు 17వ ఆరాధనను (వెంకటభాజా దర్గా) బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బుధవారం దర్శించుకున్నారు. దర్గాను దర్శించుకున్న నాయకులను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, మండల బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి శశికుమార్, బాగన్న, నవీన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

◆ వన భోజనాల్లో విద్యార్థులు

ఝరాసంగం(జహీరాబాద్): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వన భోజనాలు నిర్వహించారు. బుధవారం మండలంలోని బిడెకన్నె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామ శివారులో వన భోజన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని భోజనాలు చేశారు.

◆ అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



జిన్నారం (పటాన్‌చెరు): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన జిన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జిన్నారం మండలం కొడకంచి గ్రామపంచాయతీ పరిధిలోని పుట్టగూడ గ్రామానికి చెందిన కంచనపల్లి దాయరి మహేశ్ (30), మంగళవారం రాత్రి బయటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తెల్లవారే సరికి మహేశ్ పుట్టగూడలోని ఓ బెల్ట్ షాపు ఎదురుగా నిర్జీవంగా పడి ఉన్నట్లు గ్రామస్తులు గమనించారు. కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నయీముద్దీన్, ఎస్‌ఐ నాగలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.